# నాతిచరామి

"జయా!" భూమ్యాకాశాలు దద్దరిల్లేట్టట్లు ఒక్క-గావుకేక వేశాడు ప్రసాదరావు. ఒకజడ అల్లుకుని వీపుమీదకు జారవేసి రెండోజడ ముందుకు వేసుకొని రిబ్బను బిగిస్తున్న 'జయప్రద' ఒక్కసారి త్రుళ్లిపడింది. అన్నయ్య అంతలా ఎందుకు అరిచాడో బోధపడక మెట్లవైపు వచ్చి క్రింది హాలు లోకి చూసింది. ప్రసాదరావు చేతులు వెనక్కి విరిచిపెట్టుకుని హాలులో విసురుగా పచార్లు చేస్తున్నాడు. 'జయప్రద' తన రూమ్‌లోకెళ్లి తీరికగా బుక్స్ బాగ్‌లో పెట్టుకుని 'వాచీ' తిన్నగా తిరుగుతోందో లేదో చూసుకుని అద్దానికి తుది వీడ్కోలిచ్చి మెట్లుదిగి హాలులోకొచ్చి నిలబడింది.

"నువ్వింక కాలేజీకి వెళ్లనవసరంలేదు జయా! పైకి వెళ్లి పుస్తకాలు పెట్టేసిరా! ఒక్కక్షణం నీతో మాట్లాడాలి. నాకు ఆఫీసు'టైం' అయిపోతోంది. గమ్మునరా!" అన్నాడు ఆజ్ఞగా. అన్నయ్య అధికారస్వరానికి విస్తుపోతూ అలానే సోఫాలో కూర్చుండిపోయింది జయ.

"బోర్నవిటా కలిపి తెమ్మంటారా? భోజనం చేస్తారా బాబూ!" అని అడిగింది వంటామె.

"ఇప్పుడేంవొద్దునాకు" మళ్లీ పచారుచేయ నారంభించాడు. జయ అక్కడ కూర్చున్నదనే సంగతి విస్మరించినట్లుగా పసాదరావు.

"కాలేజీకి వెళ్లక్కర్లేదన్నావేం అన్నాయ్? స్టూడెంట్స్ దేనికయినా "స్ట్రయిక్ చేస్తున్నారా?" అంది శాంతంగా జయప్రద.

"ఏం నేరనట్టు మాట్లాడతావేం? ఈ దొంగపిల్లి వేషాలు ఎప్పట్నించి మొదలెట్టావ్! నిన్ను ఇవ్వాళ 'సస్పెండ్' చేశారటగా ప్రిన్సిపాలుగారు? కాలేజీవంకన తిరు వీధులు వేంచెయటానికి బయలుదేరావా పాపం?" అన్నాడు కోపంగా ప్రసాదరావు.

జయప్రదముఖం తడిసిన కాగితం పువ్వల్లే అయింది. అన్నయ్యకి ఎలా తెలిసిఉంటుంది ఈ సంగతి? ప్రిన్సిపాలు గారు చెప్పివుంటారా? అన్నయ్యకు ఆయనతో అంత "ఇంటి మెసీ" లేదే! ఇకపోతే సత్యవాణి. దానికి అన్నయ్యముందు మాట్లాడటానికే భయం. ఇంకె ఎవరు చెప్పివుంటారు? అంత అవసరం ఎవరికి కలిగివుంటుంది? తలవంచుకుని ఆలోచించ సాగింది. జయ ఎదురుచెప్పలేకుండా తలవంచుకోవటం చూసి ప్రసాదరావుకి జాలేసింది.

"జయా! ఏదో బుద్ధిగా చదువుకుంటావుకదా అని కాలేజీకి పంపిస్తే, నువ్వు ఇంకా "బాడ్ నేం" తెచ్చుకుంటే ఎల్లాగ చెప్పు? ఇవ్వాళ మీ తెలుగు లెక్చరర్ 'కె.డి.ఎస్.' సెంటర్లో కనబడి నిన్ను "సస్పెండ్" చేసిన సంగతి చెప్పాడు. అంతా ప్రసాదరావుగారి "సిస్టర్" ఇల్లాగా! అని చెప్పు కుంటూంటే నా తల వంగిపోదూ! నువ్వు నెమ్మదిగా చెప్తే వినిపించుకోవు. గట్టిగా అంటే నెత్తిమీది నీళ్ళకుండ దింపే

స్తావు." నెమ్మదిగా నచ్చచెప్పడం ప్రారంభించాడు ప్రసాద రావు. అన్నయ్య తగ్గడం గమనించి జయప్రద తలెత్తింది. ఆమెకు అన్నగారంటే భయమూ, చనువూ కూడా ఉన్నాయి.

"ఎవరు అన్నయ్యా నీకు చెప్తా? ఆ కె. డి. శాస్త్రినా? వాడు ఉత్త "రోగ్" అనుకో. ఫోర్తు ఇయర్‌లో వాడి 'నెవ్యూ' ఒకడున్నాడు. రాంబాబు అని. వాడిమూలంగానే నేను ఇవ్వాళ "సస్పెండ్" అయ్యాను. అన్నాయ్! నీకు అంతా చెప్తాను. తప్పంటే నన్నేమైనా చేయి! పడతాను" అని చరచరా లోపలికి వెళ్ళి పాతిక నీలంకవర్లున్న ఒక ఫైలు తీసుకొచ్చి ప్రసాదరావు కిచ్చింది. అతను ఆశ్చర్యపోతూ చదవటం ప్రారంభించాడు. వారానికి ఒకటి చొప్పున ఆరు నెల్లకు పైగా వ్రాసిన ఉత్తరాలు అవి! ఒక్కదాంట్లోకూడా జయ జవాబు ఇచ్చినట్లు లేదు. "పోనీ, జవాబు లేనా ఇయ్య కూడదా!" అంటూ రాంబాబు అనే అతను ప్రాధేయపడు తున్నట్లు వ్రాసి ఉన్నాయ్! ఒక ఉత్తరంలో "కుంతీ విలాపం" పద్యాలు ఉదహరించాడు. ఇంకొకదాంట్లో,

"ప్రియ భామినీ!

నీకోసం, నీ పలుకుకోసం నా కన్నులు కాయలు కాచే లాగున ఎదురుచూస్తున్నాను. నీ కళ్ళలోని తీక్షత నన్ను కాల్చివేస్తున్నది. కాస్త ప్రసన్నతగల చూపు అలవాటు చేసుకోకూడదా దేవీ?"

వేరొకటి,

"ఈ శుభోదయంలో నా పుష్పవాటికలో ఒక చిన్న కన్నె గులాబీ విరిసినది. దాని సోయగమునకు ఒక తేటి సాగలేక ఆగినది. ఆ గులాబీ ఆహ్వానించింది. తేటి సంతృప్తి చెంది మరలిపోయినది. విడిచిపోతున్న తేటిని తనలోని మాతృత్వపు నిండుతనాన్ని చూసుకొని ఆ గులాబీ మురిసినది." ఇలాగ కవిత్వ ధోరణిలో ఉన్నది. ప్రసాదరావు విరగబడి నవ్వాడు.

"ఇదేం వర్ణన జయా? గులాబీ పువ్వునకు మాతృత్వము లేదు. సైంటిఫిక్‌గా చూస్తే కొమ్మలు అంటు కట్టాల్సిందేకాని కాయలు కాసి విత్తనాలు కావుకదా? విత్తనాలు తయారవని పువ్వులకు మాతృత్వమేమిటి నా బొంద?"

"అతను స్పెషల్ తెలుగులే అన్నయ్యా?" అంది జయ.

"సెర్టన్లీ! అదే అనుకున్నానులే. ఊఁ. ఇదా సంగతి! దీనికి ప్రతీకారం నువ్వెలా చేశావో చెప్పు. సరదాగా వింటాను."

"చెప్తాలే అన్నాయ్. కాని ఇలా పూర్తవుతుందన్న కథ పూర్తికాలేదు. ఎదురు తిరిగింది. దానికి నువ్వుకూడా నాకు సహాయం చేసిపెట్టాలి."

"తప్పకుండా చేస్తాను. ముందు నువ్వు నీ ప్రతీకారం ఎల్లా చేశావో చెప్పు మరి?"

జయప్రదకి సిగ్గువేసింది.

"నేను చెప్పలేను అన్నయ్యా. సాయంత్రం సత్యవాణి చేత చెప్పిస్తాను. ఏం?" అంది ముద్దుగా.

## 2

"మొన్న ఆదివారం. 'ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ' మార్నింగ్ షోకి వెళ్ళాం నేనూ, మీ జయాను. మేం వెళ్ళే సరికి హైక్లాసు టిక్కెట్లు అయిపోయాయ్ అన్నారు. మేము మామూలు క్లాసుల్లో కూర్చోలేమన్న సంగతి మీకు తెలుసు కదూ? ఎల్లాగా అని ఆలోచిస్తోంటే లోపలకు వెళ్ళబోతున్న రాంబాబు మూతా కనపడ్డారు. జయకో "ఐడియా" తట్టింది. కాబోలు వెంటనే నాతో,

"ఒసే! మన హీరో వచ్చినట్టున్నాడు. అతనోక్క ఆట ఆడించనా?" అంది.

"వద్దే. ఎటొచ్చి ఎటు పోతుందో! అన్నప్పుడల్లా కలిసివస్తుందా?" అన్నాను.

"ఏం పెసిమిస్టువే మా తల్లీ!" అంది హేళనగా. నేను వెనక్కి తీస్తున్నా జయ విన్పించుకోకుండా రాంబాబు దగ్గర కెళ్ళి "చూడు మిష్టర్! మీరు టిక్కెట్లు తీసుకోటం అయిందా?" అన్నది. రాంబాబు జయ తనతో మాట్లాడటం నమ్మలేనన్నట్లు నిలువుగుడ్లేసి చూడటం మొదలెట్టాడు. నేను అన్నాను.

"చూడు. మాకు టిక్కెట్లు దొరకలేదు. అంచేత మీ ఫ్రెండ్సులో ఇద్దరి టిక్కెట్లు మాకు ఇప్పిస్తే మేము కూడా మీతోపాటు పిక్చరు చూసిపోతాం." వెంటనే

వాళ్ళల్లో వాళ్ళు గొడవచేసుకోవటం మొదలుపెట్టారు. ఏమంటే మేము వాళ్ళని పలకరించటమే కాకుండా వాళ్ళతో పాటు సినిమా కూడా చూస్తామనేసరికి వాళ్ళు నిజంగా "ఎటర్నిటీ"కి వెళ్తోన్నట్లే భావించి అలాంటి సదవకాశాన్ని జారవిడుచుకోవటం ఎవళ్ళకి వాళ్ళే ఒప్పుకోక వాళ్ళల్లో వాళ్ళు కుమ్ముక్కోవటం ప్రారంభించారు. జయ వూరుకోలేదు.

"ఏమంటావ్ మిస్టర్? అనవసరంగా గొడవలు చేసుకోవటం నా కిష్టంలేదు. మీ కిష్టం లేకపోతే మేం వెళ్ళిపోతాంలెండి" అన్నది. రాంబాబు ఎల్లానో చచ్చిచెడి ఇద్దర్ని ఒప్పించి మాకు టిక్కెట్లు ఇప్పించాడు. జయ పర్సు తీసేలోగా తనే దర్జాకి అభినయంపట్టి వాళ్ళకి డబ్బిచ్చేశాడు.

ఇంక హాలులో మాకు ఎప్పుడూలేని అలవాట్లు అన్నీ తెచ్చుకున్నాం. నాలుగుసార్లు కాఫీలు, రెండుసార్లు కూల్ డ్రింకులూ, అరడజనేసి కిళ్లీలు, ప్యారీ స్వీట్స్ తీసుకున్నాం. అన్నింటికీ వాళ్లల్లో వాళ్లు వంతులేసుకుంటూ మమ్మల్ని మేపారు."

"ఉద్ధరించారన్నమాట వాళ్లని. సిగరెట్లుకూడా కాల్చలేక పోయారుట్రా?" అన్నాడు ప్రసాదరావు.

"ఆ ప్లాను వేసిందండోయ్ మీజయ! అవికూడా రాబట్టుకుందామే వాణీ! పోనీ కారుడ్రైవరుకేనా ఇవ్వొచ్చు!" అంది. నేనే బొత్తుగా బావుండదని వద్దన్నాను. మిట్ట మధ్యాహ్నం పన్నెండున్నరదాకా రాంబాబూ, అండ్ పార్టీ" యొక్క బ్రహ్మాండమైన 'ఎస్కార్టు' తో మేము "ఫ్రమ్

హియర్ టు ఎటర్నిటీ" పిక్చరు ఎంజాయ్ చేసి ఇళ్లకు వచ్చేశాం.

నిన్న ఏం జరిగిందంటే మేము గరల్స్ రూంలోంచి క్లాసుకి వెళ్లబోతుంటే ఆ రాంబాబుగాడు —

"నిన్న సినిమాలో అయిన ఖర్చులో అయిదు రూపాయలు నన్నిచ్చెయ్యమంటున్నారు మావాళ్లు. నా చేతిలో చిల్లికానీ లేదు. ఆ అయిదురూపాయిలూ మీరిస్తే నాకు మనియార్డరు రాగానే మళ్లీ ఇచ్చేస్తాను" అన్నాడు.

"మాదగ్గర ఇప్పుడేం డబ్బుల్లేవు" అన్నాను.

మా జయ "మీతోపాటు సినిమా చూసినందుకు మీరు సంతోషంకొద్దీ చేసుకున్న ఖర్చు మేము ఇవ్వాడమేమిటి?" అంది.

"అప్పేకదా ఇమ్మన్నదీ?" అన్నాడు.

"అప్పూలేదు. సప్పూలేదు. మనిషిని నిలబెట్టి మాట్లాడుదామనీ. వెధవ్వేషాలు. అవతలికినడు!" అంది జయ దురుసుగా.

"ఏదో మీ కిష్టంవచ్చినట్లు అనుకోవచ్చును. కాని మర్యాదగా అయిదురూపాయలూ వాళ్ల మొహాన్న పారేస్తే మంచిది. లేకపోతే మనిద్దరిపేర్లూ గోడకెక్కించేస్తారు వెధవలు" అన్నాడు. తనేదో మహా మర్యాదరామన్నలా పోజుపెట్టి.

"వ్రాస్తే వ్రాయనీయి! నాకేమిటి మధ్యని?" అంది విసురుగా జయ. ఆ సమయానికి 'కె. డి. ఎస్.' గారు

కాంటీన్ నుంచి 'స్టాఫ్‌రూం' లోకెళ్ళబోతూ వీళ్లని చూస్తూ ఆగిపోయాడు. అది గమనించాడు రాంబాబు.

"అయితే నీకు సాయంత్రం ఒక షిఫాన్ చీర, పసుపు కుంకుమా, అరటిపళ్లూ పంపించనేమిటి? మా అత్తయ్యచేత?" నెమ్మదిగా పరిహాసంగా అన్నాడు. జయకు అరికాలుమంట నెత్తికెక్కింది. అతని దవడమీద ఒక లెంపకాయ ఇచ్చుకుని గరల్స్‌రూంలోకి వెళ్లిపోయింది. రాంబాబు రిపోర్టుమీద శాస్త్రిగారు సపోర్టుచేయగా మీ జయని ఇవ్వాళ 'సస్పెండ్' చేశారు." అంది సత్యవాణి. ప్రసాదరావు చెల్లెలి ఆకతాయి తనానికి నవ్వుకుని—

"అయితే ఇప్పుడేం చేద్దాము జయా? వాడు వ్రాసిన లెటర్సు ప్రిన్సిపాల్‌కి చూపెడదామా?" అన్నాడు.

"అది కాదండీ. రాంబాబు చర్య సమర్థనీయమే. అతనిమీద కసి జయ ఎప్పుడో తీర్చుకుంది. పైగా అతను మా తోటి కుర్రవాడే కనుక సరదాకి అల్లాగ ప్రవర్తించాడు. అతన్ని వొదిలేయచ్చును. ఈ కె. డి. శాస్త్రి ఉన్నాడు చూశారూ? వీడు అనవసరంగా ఆడపిల్లలమీద లేనిపోని 'శ్కాండల్సు' ప్రచారంచేస్తున్నాడు. వాడి జులుబు వొదిలిస్తే కాని కాలేజీలో ఆడపిల్లల మనుగడ దుర్భరమైపోతోంది" అంది సత్యవాణి.

"నిజమేనా జయా?" అన్నాడు ప్రసాదరావు.

"నిజమే అన్నాయ్! నావల్ల కాలేజీ పాడయిపోతూం దని వాడి భార్యతో చెప్పాట్ట. ఆమె వెళ్ళి వాళ్ళ ఇంటివారి

అమ్మాయితో చెప్పిందట. అది గాలిలో తేలి నాదాకా వచ్చింది. ఈయనతో కాలేజీలో అందరూ వెళ్ళి ఎల్లాగయినా జయప్రదని "డిబారు" చేయిస్తేకాని మా చదువులు సాగటంలేదు. అని మొరపెట్టారుట. చూడు మరి?" అంది రుద్ధ కంఠంతో జయప్రద.

"అయితే ఏం చేయడం? ఆయనమీద రిపోర్టు ఇవ్వడం ఎల్లాగ మరి?" అన్నాడు ప్రసాదరావు.

"అబ్బే! అదేం కుదరదండీ! క్లాసుల్లో 'స్ట్రిక్టు'గా ఉన్నట్లు నటిస్తాడు. దొంగముండాకొడుకు!" అంది సత్యవాణి.

"మనమే ఎల్లానో పట్టివ్వాలి అన్నాయ్!" అంది జయ. ఆలోచనతో ఆమె కళ్ళు తళుక్ మన్నాయ్!

## 3

సాయంకాలం కాలేజీనించి ఇంటికి వచ్చి సంధ్య వారుస్తూండగా "మీకోసం ఎవరో వచ్చి కూర్చున్నారు! చప్పున తెమల్చండి!" అన్నది. దయానిధిశాస్త్రి భార్య లలితాంబ! కె. డి. శాస్త్రి ఎవరా అని ఆలోచిస్తూ బయటికి వచ్చి "నమస్కారం" అన్న ప్రసాదరావుని ప్రశ్నార్థకంగా చూసి "దయచేయండి" అని కుర్చీ చూపించాడు.

"నన్ను ప్రసాదరావు అంటారండి. మా చెల్లెలు జయప్రద కాలేజీలో "థర్డు ఇయర్" చదువుతూంది లెండి. ఆమె మార్చికి "భాషాప్రవీణ"కు 'అపీయర్' అవుదామనుకుంటున్నది. మీరు బాగా చెప్పగలరని 'ప్రిన్సిపాల్' చెప్పారట. అంచేత మీరు దయయుంచి మా చెల్లెలికి "ట్యూషన్"

చెప్పాలి!" అన్నాడు ప్రసాదరావు వినయంగా. కె. డి. ఎస్. నిర్ఘాంతపోయాడు. ఒక్కసారి జంధ్యాలు సవరించుకున్నాడు.

"జయా! జయా! ఆ సైకిలువాలీ! ఆ పిల్ల శాంస్క్రిట్ చదువుతుందీ!" అనేశాడు అప్రయత్నంగా.

ప్రసాదరావు చిన్నగా నవ్వాడు.

"దాన్నిచూస్తే అందరికీ అలాంటి అనుమానమే కలుగుతుందిలెండి. కాని చాలా మంచిపిల్ల. మా నాన్నగారు దాని చిన్నతనమంతా ఉత్తరాదిని ఉద్యోగంలో ఉండేవారు. అంచేత దానికి ఆటువెంపు అమ్మాయిల విచ్చలవిడితనం అల వాటు అయిపోయింది. దాన్ని పరిపూర్ణమైన భారతీయ వనితగా తీర్చిదిద్దాలని నా ఆశయం. దానికి సంస్కృతభాషాభ్యాసము అవసరమని నా భావన!" అన్నాడు. మిసెస్ కె. డి. ఎస్. 'లలితాంబ' పాలూ, పళ్లూ తెచ్చి మేజాబల్లమీదుంచింది.

"కాఫీ, టీ మొదలగు పానీయాలు తామస ప్రవృత్తిని ప్రకోపింపజేస్తాయని నేను పాలే తీసుకుంటాను. అదీన్నీ శ్రేష్ఠమైన గోక్షీరమైతేనే!" అన్నాడు దయానిధిశాస్త్రి ఒక పాల గ్లాసు ప్రసాదరావు వెంపు తోస్తూనూ.

"అది నిజమే! ఆధ్యాత్మికంగా ఉన్నతులైన మన భారతదేశపు ప్రజలు, కాఫీలు, ఫేషన్లు పెచ్చుపెరగటంతో విషయవాంఛలకి బానిసలైపోతున్నారు. ఈ పరిస్థితిలో ఇప్పటి నాగరికతమీాద విప్లవం వస్తేకాని మనం బాగుపడము" అన్నాడు ప్రసాదరావు.

"ఏం విప్లవం వస్తుందో ఉద్ధరి! ఈయన చూడకపోతే సినిమాకు తీసుకపొమ్మన్నా తీసుకెళ్లరుకదా! సాటివారు "టింగురంగా" అంటూ కాలంగడుపుతూంటే నేను ఈయన ఆచారాలలోమస్సై మంటకలిసిపోవాల్సి వస్తోంది. అన్నయ్యా గారూ!" అనేసింది లలితాంబ.

ఆమెకేసి పరీక్షగా చూశాడు ప్రసాదరావు. లలితాంబ ఇరవయి ఏళ్ల స్త్రీ! పచ్చటిపూలతో టర్నింగుబోర్డరుఉన్న ఎర్రటి కాశ్మీరపు సిల్కు-చీర కచ్చపోసి కట్టుకుంది. చేతికందని మెలికలుతిరిగే జుట్టు బిగించి జడ అల్లి గుండ్రడసిగ చుట్టుకుంది. కాళ్లకి గొళ్లెపుగొలుసులు. మెడలో నల్లపూసల తావళం. ఏమిటో, ఆ సింగారం ఆమెకు ఎబ్బెట్టుగా ఉంటటంతో ప్రసాదరావుకి కె. డి. ఎస్. చాదస్తం అర్థమయిపోయింది. ప్రొద్దున్న ఏడు మొదలు ఎనిమిదిన్నరదాకా జయప్రద ఇంటి వద్ద, కె. డి. ఎస్. సంస్కృతం నేర్పడానికి 'ట్యూషన్' కాబడింది. రామోదంతం మొదలుపెట్టి వరసగా చదువుకుపోతూ కుమార సంభవం, కాదంబరిలో మహాశ్వేత వృత్తాంతము, మధ్యమ సిద్ధాంతకౌముది పూర్తిచేశారు. ఇంక కోర్సులో మిగిలిఉన్నది అభిజ్ఞాన శాకుంతలము. అది పరీక్షలముందు చదువుకోవచ్చును అంది జయప్రద. అంచేత విక్రమోర్వశీయము, మృచ్ఛకటికమ్, ప్రియదర్శిక, నాగానందం చదివింది. ఆమె గురువుగారివద్ద శ్రద్ధగా కావ్యనాటకాలలోని నవరసాల్ని ఆకళింపుచేసుకుంటున్నది. "ఆమె చిన్నతనం ఉత్తరాదిన గడిపింది" అన్న సంగతి దయానిధిశాస్త్రి గుర్తించుటకు శరీరాన్ని

అదుపులో పెట్టుకునే ఆమెకు కావ్యనాటకాలలోని భావాలను విపులీకరించేవాడు.

లలితాంబ మడికట్టుకొని వంటచేస్తుంది. పెళ్లయిన కొత్తలో ఆమెభర్త కాలేజీలో తెలుగులెక్చరర్ అని వింటంతో ఆమె మురిసిపోయింది. ఆ మురిపెంలో భర్తదగ్గర తనను కాలేజీలో జాయినవుదామన్న కోర్కె ఉందని తెలిసింది. ఆమె స్కూల్ ఫయినల్ ప్యాసయి వుందన్నసంగతి పాపం శాస్త్రికి తెలియదు. అతని ఒళ్లు జల్లుమంది. తన భార్యా! కాలేజీ గర్ల్ అవడమా? అమ్మయ్యో! ఇంకేమన్నా ఉందీ! అప్పట్నించీ అతను పనిగట్టుకుని లలితాంబతో రోజూ కాలేజీ అమ్మాయిల బేడ్ కారెక్టర్సునిగురించి వర్ణించి చెప్పేవాడు. లలిత అనే మృదువుగా ఉందని భయమేసి లలితాంబ అని మార్చేశాడుకూడా. అలా చెప్పుకోవటంలో ఒకరోజు జయప్రదపేరుకూడా. జారేశాడు. అది జయదాకా వెళ్లింది. ఆమె శ్రౌచల్లే లేచి కనిపెట్టుకు కూర్చుంది. జయప్రద చిత్రంగానే ఉండేది. రోజుకో కాస్ట్యూమ్ ధరించేది. ఎండగా ఉన్నప్పుడు గాగుల్స్ వేసుకునేది. కారు అన్నయ్య తీసుకెళ్లినప్పుడు సైకిలు ఉపయోగించేది. 'డిపేటు'ల్లో పాల్గొనేది. ఆమె ఎన్. సి. సి. డ్రస్‌లో నడుస్తూంటే కె. డి. ఎస్. కళ్లప్పగించి చూసేవాడు. జయప్రదకు ఏది చెప్పినా ఇటే గ్రహించే అసాధారణగ్రహణశక్తి ఉన్నది. ఆమెకు ప్రిన్సిపాల్ కూతురూ క్లాసుమెటూ అయిన సత్యవాణి ప్రాణమిత్రురాలు!

# 4

ఆరోజు జయప్రద పుట్టినరోజు! తెల్లవారకుండానే ప్రసాదరావు జయప్రదకు తానివ్వాళ పార్టీ ఏర్పాటుచేశాననీ అందర్నీ పిలుచుకొమ్మనీ చెప్పాడు. జయ లేచి తలంటుకొని "బ్రేక్ ఫాస్టు" పూర్తికానిచ్చి సత్యవాణికి ఫోను చేసింది.

"ఇవ్వాళ నా భర్తడే! కాస్త మాగురువుగారిని ఇన్వాయిట్ చేయాలి. వేగం తయారయి రావే!" అంది.

"ఓ! తప్పకుండా వస్తున్నాను" అంది సత్యవాణి. డ్రెస్సింగ్ టేబుల్ వద్ద కూర్చుంది జయ. మామూలుగా రెండు జడలు వేసుకుని మళ్ళీ నచ్చక విప్పేసింది. జుట్టు ఆరు పాయలుగా వేరుచేసి దువ్వెనతో మెలిపెట్టి పైన హెయిర్ క్లిప్పులు పెట్టి బిగించింది. భుజంమీదికి ఆరుపాయలూ ఆరు త్రాళ్ళల్లా వ్రేలాడుతున్నాయ్! తెల్లగా పొడుగ్గా ఉన్న మెడలో ఒంటి వరస ముత్యాలహారం! ఒకచేతికి మూడేసి వరసల తెల్లరాళ్లు పొదగబడిన బ్రేస్ లెట్. రెండో చేతికి ఆరు బంగారు డైమన్ కటింగ్ గాజులు. ఒంటివంపుల్ని వ్యక్తంచేసేట్టున్న పచ్చని పట్టుచారలున్న తెల్లటి జార్జెట్ కమీజు! లేత ఆకుపచ్చ సాటిన్ సాల్వార్! చమ్కీపని చేసిన చెప్పులు!

"ఆహా! ఒమార్ గారి ప్రేయసిలా తయారయ్యావే? మనం వెళ్తున్నది "ముఘల్ గార్డెన్సులో" విహారాన్ని కనుకుంటున్నావేమిటి? దయానిధిశాస్త్రిల్లవారింటికి "తన జన్మ దినోత్సవ సందర్భ ఆహ్వాన నిమిత్తం" అని మరచినావా? చేలమైన బాలా?" అంది సత్యవాణి.

"ఏం బాగులేదా సత్యా?" అంది జయ.

"బాగులేకేం? నాకు బాగానే ఉంది. రోడ్డమ్మట వెళ్తుంటే స్టూడెంట్లకూడా నయనానందంగానే ఉంటుంది. కాని పవిత్రమైన గృహస్థాశ్రమము నిర్వహిస్తున్న గురువుగారి సన్నిధిని ఈ వేషభాషలు ఎంతమాత్రము "ఇంప్రెస్" చేయ జాలవని నొక్కి వక్కాణించుచుంటిని. ఏమనుకోకు జయా!"

"అయితే ఎల్లా తయారవమంటావు చెప్పు? కొప్పెట్టుకొని, కొప్పులో తంగేడు పూలెట్టుకుని, తట్ట నెత్తిన పెట్టుకుని నల్లటి చీర మరాటీ స్టయిల్‌లో కడ్తే బాగుంటుందా?" అంది జయ జుట్టుపాయలు విప్పేస్తూ.

"అంతమాట నే ననలేనుకాని, మన పూళ్ళో సంపన్నులైన కన్యలవేషం ధరిస్తే చాలు అనుకొంటున్నాను" అన్నది సత్య. ఈసారి జయప్రద వొదులుగావాలుజడ వేసుకొని జాజి పూల మాల పెట్టుకుంది. ముదురు ఆకుపచ్చని పట్టు పరికిణీ మీాద లేత నీలి జార్జెటు వోణీ వేసుకుని మిరపపండు రంగు చో[illegible] చెల్లని మెడని ముద్దుపెడుతుండగా కళ్ళనిండుగా కాటుక పెట్టుకొ[illegible] చిన్న నొక్కు ఉన్న గడ్డంమీాద అగరుచుక్క పెట్టింది. చెవులకి రాళ్ల జుంకీలు, ముత్యాల మాటీలు (చంప స్వరములు) నుదుట ఆండాళ్ళు బొట్టు (పైన దోసగింజలా క్రింద గుండ్రని చుక్క) ధరించి,

"సత్యా!" అంది ఆలోచనగా.

"అనుసరామి!" అంది సత్య.

"ఏమిటేవ్, సంస్కృతంలో మాట్లాడేస్తున్నావ్ ?" అంది జయ.

"సూదితోటే దారమూనూ. జయా ! నీ కోర్కె ఎంతవరకూ అయిందే ?"

"అవుతోంది. అవుతోంది. కాని లొంగుబాటుకు రావటం లేదే గురుడు !"

"నీలోనే ఉందిలే అంటాను, బొత్తుగా ఫాషన్ షోలో మోడల్‌లా తయారవుతావు ! దాంతో గాభరాపడి పోతున్నాడు. కాస్త మన సాంప్రదాయం ప్రకారం నువ్వు తయారయితే ఈపాటికే నిన్ను ..."

"చాల్లే ! చాల్లే ! ఓవర్ డోస్ అయిపోతోంది." ఇద్దరూ గురువుగారింటికి వెళ్ళారు. వరండాలో కూర్చుని చదువుకుంటున్న రాంబాబు వీళ్ళను చూడగానే తేలు కుట్టి నట్లు ఒక్క గెంతు గెంతి వంటింట్లో పనిలో ఉన్న లలితాంబ ముందు వ్రాలాడు.

"అత్తా ! నేను నిమిత్తమాత్రుణ్ణి. అంతా మామయ్యే చేస్తా ! నన్ను క్షమించి రక్షించు అత్తా !" అన్నాడు.

"ఏమిటయ్యా అసలు సంగతి ?"

"అదే అత్తా ! అదే ! అదంటే ఆ అమ్మాయి, నన్ను కొట్టేసిన అమ్మాయి, మనింట్లోకి వస్తోంది. వచ్చేసింది ! అయ్యో బాబోయ్ ! "అత్తా ! నాదేం తప్పులేదు. నన్ను రక్షించు. ఈ దీనుణ్ణి కనికరించు !"

"వూ సోది పెట్టకు! నన్నవతలకి వెళ్ళనీ మరి!" అంది లలితాంబ నవ్వుకొని.

"అమ్మగారూ!" అని పిలిచింది సత్యవాణి.

"ఎవరితాలూకూ?" అడిగింది లలితాంబ.

"మీతాలూకే! మీవారి శిష్యురాలు ఈ అమ్మాయి. ఇవ్వాళ పుట్టినరోజట. మీతో చెప్దామని వచ్చింది" అంది సత్యవాణి.

"కాలేజీ పిల్లే అన్నమాట."

"అవును. మీవారిదగ్గర సంస్కృతం ట్యూషను చెప్పించుకుంటోంది."

"చెల్లెలికా పుట్టినరోజు?"

"నాకు నేనే అక్కనీ, చెల్లినీ. నాదేనండి పుట్టిన రోజు" అంది జయప్రద.

"మీ గురువుగారు దేవతార్చనలో ఉన్నారమ్మాయ్!" లోపల్నించి దయానిధిశాస్త్రి కంచుకంఠం.

"గాతుం యజ్ఞాయ, గాతుం యజ్ఞపతయే దైవీ స్వస్తి రస్తునః"—రాగవరుసలో వినపడింది.

"అయిపోవచ్చింది కదా! చెప్పేసే వెళ్తాములెండి" అంది జయ. లలితాంబ 'ఒకమూల తనూ వాళ్ళల్లా ఉండాల్సినదాన్నే కదా అనే చింత మనస్సుని వేధిస్తున్నా'—

"జౌరా! ఎంత బరితెగిపోయారూ? పద్దెనిమిదేళ్ళొచ్చి నలుగురేసి పిల్లల తల్లుల్లా ఉండి ఇంకా మా పుట్టినరోజు మా పుట్టినరోజు అంటూ మగాళ్ళనికూడా పిలవటానికి తయా

రయ్యార్రు. వీళ్ళకి సిగ్గూ ఎగ్గూ అన్నది ఉంటుందా?" అన్న ట్లుగా ముక్కుమీద వేలుంచుకోంది. జయ, సత్య ఆమెని పరిలిశీస్తూ నిలబడ్డారు. దయానిధిశాస్త్రిల్లవారు ఒక అంగ వస్త్రం చుట్టుకొని ఒక అంగవస్త్రం భుజంమీదుంచుకొని చెవులో నందివర్ధనం పువ్వు, నుదుట విభూతి రేకలమధ్య కుంకుమ బొట్టుతో ఇవతలికి వచ్చారు.

"ఏమిటి విశేషం?" అన్నారు.

"ఇవ్వాళ నా బర్తుడే. అన్నయ్య పార్టీ ఏర్పాటు చేశాడు. మీరు, మీ మిసెసు తప్పక రావాలి సాయంత్రం" అంది జయ.

"ఇప్పుడే గట్టిగా చెప్పమ్మాయ్ ! లేకపోతే ఆయన నన్ను ఎక్కడకూ తీసుకుపోరు" అనేసింది లలితాంబ. భార్య కేసి ఎర్రగా, గుర్రుగా చూశాడు శాస్త్రి.

"ఏం? అలా చూస్తారేం? ఉన్నమాటంటే ఉలు కెక్కువట పాపం!" లలితాంబ సాగదీసుకుంటూ లోపలి కెళ్ళిపోయింది. సాటి స్త్రీ అసహాయతకి ఆరాటపడింది జయ అమృతహృదయం!

"తప్పక తీసుకరండి మాస్టారూ ! ఈ రోజుల్లోకూడా వెలుగు చూపించకపోతే ఎల్లాగా?" అనేసింది జయ.

"అది తిన్నగా ఉండేరకం కాదు జయా! మీలాంటి వాళ్ళమధ్య తిరిగిందంటే మీ ఫాషన్ను చేసుకోవటం మొదలెడుతుంది. అది నాకు నచ్చదు. వాళ్ళక్కయ్యల్లో ఒకర్తి "విడో మారేజ్" చేసుకుంది. ఇంకొకర్తి క్లబ్బు లేడీ. ఇంకో

ఆవిడ పోషలు వర్కరు. ఇలాంటి వంశంలోదని నాకు తెలియక పెళ్ళాడాను. నా జాగ్రత్తలో నేనుండకపోతే ఎల్లాగ ?" అన్నాడు.

"వెరీసారీ ! పెర్సనల్ మాటర్సులో కలుగజేసుకున్నాం. ఏం బాధపడకండి మాష్టారూ !" అంది జయ అనునయంగా.

"నో ! నో ! నేను బాధపడటంఅనేది ఎప్పుడో మర్చిపోయా జయా!" అన్నాడు జయకళ్ళల్లోకి ఆవేదనగాచూస్తూ.

దార్లో "ఏమేవ్ మాష్టారు దార్లో పడ్డట్టున్నారు. రాంబాబు గతేంకాను ?" అంది సత్య.

"నోర్మూసుకోవే ! ఇద్దరిగతీ చూస్తాను" అంది జయ.

ఇక్కడ కొంచెం దయానిధిశాస్త్రిని గురించి చెప్తే ఫరావాలేదు అనుకుంటాను. అతను పూర్వాచార పరాయణుడు. త్రికాలాలు సంధ్య వారుస్తాడు. కాలేజీలో అతనికి ప్రవరాఖ్యుడు అనే బిరుదు ఉన్నది. బెనారస్ హిందూ యూనివర్శిటీలో శాంస్క్రిట్ ఎం. ఎ. ప్యాసయినాడు. ఉభయ భాషాప్రవీణ కూడా ప్యాసయినాడు. వేదాంతము, తర్కము అతని అభిమానపు సబ్జెక్ట్సు. ఇప్పుడు జయ కోసమని అతను కావ్య నాటకాలన్నీ తిరగేయటం ప్రారంభించాడు.

జయ "మాష్టారూ ! కేవలం పరీక్ష చదువు చదివితే ఏం లాభముండీ ? కాదంబరిలో మూడు ఛాప్టర్సూ, కుమారసంభవములో నాలుగు కాంటోస్ చదువుకుని మీరు చెప్పిన క్వొశ్చ నాన్సర్సు బట్టీవేసి అవి ముక్కున పెట్టుకుని పరీక్ష

ప్రాసేసి భాషాప్రవీణ డిగ్రీ తెచ్చుకుంటే ఏం సాహిత్య మబ్బు తుందీ? నాకు భాషలోని భావగాంభీర్యము, శబ్దమాధుర్యము అర్థమయ్యే లాగున మీరు చెప్పాలి మాష్టారూ! మీరా సంపూర్ణ సహకారం లేనిదే నాకు సంస్కృత సాహిత్య సమగ్ర పరిశీలన అలవడదు" అన్నది. నిమిషానికొక వేషం ధరించే ఈ ఫాషన్‌బుల్ గర్ల్ జయలో ఇంత సాహిత్యపిపాస కలగటం తన సన్నిధికోసం తపన అయివుంటుందని అభిప్రాయ పడ్డాడు శాస్త్రి! జయకూడా చాలా "సిన్సియర్"గా చదువు కునేది. ఆమె కాలేజీకి ఎలా వెళ్ళినా ట్యూషన్‌ముందర మాత్రం అచ్చమయిన తెలుగు బాలికలా వర్తించేది. జయ రోజూ ఏరోజు పాఠం ఆరోజు అన్నయ్య దగ్గరా, సత్యవాణి దగ్గరా చెప్పేది. వాళ్ళల్లో వాళ్ళు చమత్కరించుకుని నవ్వుకునేవారు. జనవరి నెల గడచిపోయింది. గురువుగారూ, శిష్యురాలూ అభిజ్ఞాన శాకుంతల నాటకము చదువుట కుపక్ర మించారు. జయ శకుంతల నాటకంమీద గట్టి నమ్మకము పెట్టుకొని ఉన్నది. "మాష్టారూ! ప్రొద్దుటిపూట ఆరింటికే వచ్చేయండి. ఎనిమిదిన్నరదాకా చదువుకోవచ్చు" అని చెప్పింది. ఇద్దరూ అభిజ్ఞాన శాకుంతలములోని "భావ వైరుధ్యాన్ని" గూర్చి కాంట్రోవర్సీ వేసుకునేవారు.

## 5

హేమంతపు ఆఖరి ఉషోదయము! విరిసిన పారి జాతాలు ఒకొక్కటీ నేలమీద రాలుతున్నయ్. వాటి కాడల్లోని ఎరుపుదనం, రేకుల్లోని తెల్లదనం కలిసి ముత్యాలూ,

పగడాలూ కన్పట్టుతున్నాయ్. బాల్కనీమీద జయ, శాస్త్రి గారు కూర్చున్న పేము కుర్చీలమీదికి వంగిన పొన్నపూల రెమ్మ చుట్టూ ఆ పూల సువాసనకు తేనెటీగలూ, తుమ్మెదలూ ముసురుతుంటే శాస్త్రిగారు నిర్లిప్తంగా చూస్తుండిపోయారు. జయ ఆరోజు లేత పసుపుపచ్చని జార్జెటు చీర, బ్లౌజు ధరించింది. మెడమీదికి జారిపోయే జుట్టు వదులుగా జారుముడి వేసి రెండు ఆకులు ఉన్న ఎర్రని మందార పువ్వు తురుముకొంది. ద్వితీయాంకములో గ్రంథము నడుస్తోంది. జయ కనుకొలకుల్లోంచి దయానిధిశాస్త్రిని పరీక్షిస్తూ నెమ్మదిగా చదువ నారంభించింది.

"స్నిగ్ధం వీక్షిత మన్యతోఽపి నయనే,
య త్ప్రేరయన్త్యా తయా,
యాతం యచ్చ నితంబయో ర్గురుతయా
మందం విలాసా దివ,
మాగా ఇత్యుపరుద్ధయా యదపి సా,
సాసూయ ముక్తా సఖీ,
సర్వం తత్కిల మత్పరాయణ మహో,
కామీ స్వతాం పశ్యతి!"

"అహో! కామీ స్వతాం పశ్యతి!"

ఆశ్చర్యము! కోరికలు గల పురుషుడు అంతయు తన నిమిత్తమని చూచుచున్నాడు!

దయానిధిశాస్త్రి భావము విడమర్చి చెప్పుచున్నాడు.

"శకుంతలకు అందముగా చూచుటయు, నెమ్మదిగా, సవిలాసముగా నడచుటయు స్వభావము. కాని దుష్యంతుడు అది అంతయు తనని గురించే అని భ్రమపడుచున్నాడు."

జయప్రద శాస్త్రిగారివంక నిర్నిమేషంగా చూస్తూండిపోయింది. కిటికీ వెనకాతల నైలాన్ కర్టెన్లు మనుష్యుల నీడలజాడలతో చిరుగాలికి రెపరెపలాడసాగాయ్. ఒక్కసారి జయ హృదయం దడదడలాడసాగింది. చేతులు వణకిపోగా ఆమె చేతిలోని పెన్ను దయానిధిశాస్త్రి పాదము దగ్గర జారిపోయినది. ఆమెపెన్నుకోసరము క్రిందికివంగగా ఆమెపైట చలిగాలికి తపతపలాడుతూ ఆమె మోచేతిమడత మీదికిజారింది. దయానిధి కళ్లకి మెరుపు కొట్టినట్లయింది. ఆమె జయేనా? కాదుకాదు. ముమ్మాటికీ కాదు. కణ్వాశ్రమంలోని శకుంతల! దుష్యంతుణ్ణి కళ్లారా చూడాలని ఆకాంక్షిస్తూ చెలుల పరిహాసోక్తులకు బేజారయిపోయి ఉత్తరీయము పొదలోచిక్కున్న మిషతో అగిపోయిన శకుంతలే ఇక్కడ జయగా అవతరించి తనపాదార్చనకోసరం పెన్నుమిషతో వంగివుంది. సూర్యోదయమైనా ఇంకా చలివదల్లేదు. ఆ చలిగాలిలోకూడా అతని చెంపలు చమర్చుతూండగా తటాలున లేచి జయ రెండు భుజాలు పట్టుకుని తనవెంపు త్రిప్పుకుని;

"జయా! నీవు నిజంగా సుమబాలవే! నా పాలిటి శకుంతలవి. నా హృదయరాణివి?" గట్టిగా హృదయానికి హత్తుకోబోయాడు.

"స్టాపిట్! మా గొప్ప దక్షిణ నాయకుడివి బయల్దేరావు! మర్యాదస్థుడివికదా అని చదువుచెప్పమంటే బిల్హణీయం సాగిద్దా మనుకుంటున్నావా? నువ్వింత నీచుడివి అని కానలేకపోయాను. ఇదేనా నీ మర్యాద ముసుగు? ఇదా నీధర్మ ప్రతిష్ఠాపన!" ప్రసాదరావు హుంకరించాడు.

"మాస్టారూ? నన్ను 'డిబారు'చేస్తేకాని కాలేజీ బాగుపడదు అన్నారుట. మీలాంటి బాధ్యతఉన్న పెద్దమనుష్యులే మమ్మల్ని ఈ దృష్టితో చూస్తూంటే ఇంక కుర్రకారువాళ్లు అలా ప్రవర్తిస్తే తప్పేముంది చెప్పండి! ఏదో కుర్రవాళ్లంకనుక సరదాకొద్దీ బాగా డ్రస్సయి కాలేజీకొస్తే "అదేనా 'యూనిఫారమ్' అంటూ లేదుకనుక"మీ చూసి ఆగలేక అత్యాచారాలు జరుపబోయి అవి సాగకపోతే అసభ్య ప్రచారాలు చేయటం మొదలుపెట్టారా? మీకు లొంగకపోతే మామీద అసూయపడటం తప్పకదూ! రేపటి్నంచీ నాకు మీరు కావ్యబోధన చేయక్కరలేదు. గుడ్ బై!" అంది జయప్రద.

"ఏమిటయ్యా శాస్త్రిలూ? మాదగ్గర అంత నెమ్మదిగా వుండేవాడివీ? నువ్వు చెప్పినమాటలన్నీ నిజమే అనుకుని నమ్మి పాపం నిష్కారణంగా జయను అవమానించాము. నీ బుద్ధిమంతతనం అంతా మాదగ్గరే అన్నమాట. అన్నీ

చెప్పినవాడివి జయ వంటిగా కనపడేసరికి పెసరపప్పుజావలా తయారయినా వేమిటి! "నాతిచరామి" అని అగ్నిసాక్షిగా ప్రతినపట్టి ఆర్నెల్లయినా తిరగలేదు మళ్లీ చూడపోతేను" అన్నారు. ప్రొద్దుటే "బ్రెక్‌ఫాస్టు"కి ప్రసాదరావు ఆహ్వానం మీద అక్కడికి వచ్చిన ప్రిన్సిపాలు 'సాగరు'గారు !!